# రమణ పరంపర

పుణ్యం పండిన ప్రతి వ్యక్తినీ ఆకర్షిం చారు భగవాన్. అనేకమంది వారి సన్నిధానంలోనే ఉండిపోయారు.

కొంతమంది భగవాన్ మీదా, వారి అహం మూలాన్వేషణ పద్ధతి మీదా పుస్తకాలు వ్రాశారు.

అలా వ్రాసిన తెలుగువారిలో పూజ్యులు కావ్యకంఠ గణపతి మునీంద్రులూ, మునగాల వెంకట్రామయ్య గారు, కృష్ణభిక్షు గారు, సూరినాగమ్మ గారు, చలం గారు, గిద్దలూరి లక్ష్మీనరసింహం గారు, G.V. సుబ్బరామయ్య గారు, నిమిషకవి పేర్రాజు గారు ముఖ్యులు.

ఇక, భగవాన్ దర్శనానికి నోచుకోక పోయినా, ఏ పూర్వజన్మల పుణ్యఫలం వల్లనో భగవాన్ భక్తులై ఆంధ్రదేశమంతటా రమణ గోష్ఠులు జరుపుతున్న మహానుభావులు మనకు తెలిసి ఉన్నంతవరకు ముగ్గురు వున్నారు.

ఒకరు కృష్ణాజిల్లా వాస్తవ్యులూ, "రమణ వాణి" సంపాదకులూ అయిన G.V. నాగేశ్వరరావు గారు. వీరి ప్రసంగం ఒక జీవనదిలా, తాపీగా ప్రవహిస్తూన్నట్లు వుండి వీనులకు విందు చేస్తుంది. ప్రేక్షకులను బాగా ఆకట్టుకుంటుంది.

రెండవవారు పశ్చిమగోదావరి జిల్లా జిన్నూరు వాస్తవ్యులైన భూపతిరాజు వెంకట లక్ష్మీనరసింహరాజు గారు (జిన్నూరు నాన్నగారు). వీరు జన్మతః మహావక్త. గొప్ప తత్వవేత్త. వీరి ప్రసంగం మంద్రస్థాయిలో ప్రారంభమై, మధ్యమస్థాయికి చేరుకుని, ఉరుములు మెరుపులతో, సింహగర్జనలతో ఎప్పుడో ఎక్కడో తారాస్థాయిలో ముగు స్తుంది. ప్రసంగ మధ్యంలో వీరిని ఏ దేవతో ఆవేశించినట్టు తోస్తుంది. వీరు శ్రోతల హృదయాల మీద చెరగని ముద్రలు వేస్తారు.

వీరిద్దరూ ఏకధాటిన నాలుగైదు గంటలు ప్రసంగించినా వినేవారికి విసుగు పుట్టదు సరికదా, మరికొంతసేపు చెబితే బాగుండును అని కూడా అనిపిస్తుంది.

మూడవవారు అనంతపురం జిల్లా తాడిపత్రి వాస్తవ్యులూ, "భగవాన్ శ్రీ రమణమహర్షి ఆశ్రమం" వ్యవస్థాపకులూ, అధ్యక్షులూ అయిన V.V. బ్రహ్మం గారు. వీరు కూడా చక్కగా ప్రసంగిస్తారు. వీరు భగవాన్‌కు అంకితమైన అదృష్టవంతులు.

Courtesy: Atma Darshini, Telugu, Spiritual Monthly, Oct 2011